అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం 07 మే 2023

గ్రామాభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సిరికొండ

తమ గ్రామంలో పలు రోడ్లు, గిర్ని చౌరస్తా వద్ద బస్టాండ్ నిర్మాణం, కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరు చేయాలని సిరికొండ మండలం పెద్దవాల్గోట్ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు టీఎస్ ఆర్టీసీ చైర్మెన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను హైదరాబాద్‌లో ఆయన నివాసంలో శనివారం కలిసి విన్నవిం చారు. సాను కూలంగా స్పందించిన ఎమ్మెల్యే గ్రామపంచాయతీ నుంచి చిన్నవాల్గోట్‌కు వెళ్లే దారి, గిర్ని చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్‌స్టాప్, కమ్యూనిటీ భవనాలకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

నేడు 14 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్

భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 14 అడుగుల విగ్రహావిష్కరణను నేడు సాయంత్రం 6గంటలకు పట్టణంలోని మామిడిపల్లిలో ఉంటుందని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, నిర్వాహకులు శనివారం తెలిపారు. విగ్రహావిష్కరణ సభలో ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ కాసీం ఉస్మానియా యూనివర్సిటీ, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఆర్.లింబాద్రి ఉన్నత విద్యామండలి చైర్మన్, పి.సరిత అసిస్టెంట్ ప్రొఫెసర్ తెలంగాణ యూనివర్సిటీ పాల్గొంటారని తెలిపారు. ఈ సభలో వక్తలుగా ఇ.పోచన్న టీపీటీఎఫ్, డాక్టర్ మధుశేఖర్, డాక్టర్ అశోక్, ఎంపీపీ పస్క నరసయ్య, మున్సిపల్ చైర్మన్ వినీత పవన్ పాల్గొంటారని వారు తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా మెడిదాల రవిగౌడ్, కాశీరాం, ఆకుల రాము, రాజ గంగారం, నర్సారెడ్డి, విగ్రహ దాత డిచ్‌పల్లి దినేష్, మామిడిపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొంటారని వారు వివరించారు.


రాస్తారోకో చేపట్టిన రైతులు

తరుగుపేరిట దగా

- రైస్‌మిల్లర్లు మోసం చేస్తున్నారు
- రైతుల రాస్తారోకో.. కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-లింగంపేట్

రైస్‌మిల్ నిర్వాహకులు తరుగు పేరిట మోసం చేస్తున్నారని రైతులు వాపోయారు. రైస్‌మిల్లర్‌లపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం లింగంపేట్ మండలంలోని మేంగారం గ్రామానికి చెందిన రైతులు ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. మేంగారం గ్రామ సమీపంలోని కొనుగోలు కేంద్రం నుండి మేంగారం అయ్యపల్లి గ్రామానికి చెందిన రైతులు ధాన్యాన్ని లారీలో రైస్ మిల్ కు మూడు రోజుల క్రితం తరలించారు. సదర్ రైస్ మిల్ నిర్వాహకులు లారీలో 25 బస్తాలు తక్కువ ఉన్నాయని కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు గ్రామస్తులకు సూచించడంతో గ్రామానికి చెందిన రైతులు రైస్ మిల్ యజమాని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. రోడ్డుపై బైఠాయించారు. ఎల్లారెడ్డి నుండి కామారెడ్డికి వెళ్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్.. రైతుల ఆందోళన విషయం తెలుసుకొని ఆగి రైతులతో మాట్లాడారు. ధాన్యం బస్తాలు తక్కువ వస్తున్నాయని రైస్ మిల్ నిర్వాహకులు అంటున్నారని కలెక్షన్ దృష్టికి తీసుకురాగా వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి సదరు రైస్‌మిల్ నిర్వాహకులతో మాట్లాడారు. రైతులు తరలించిన ధాన్యంలో కోత విధించొద్దని సూచించారు. దీంతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు.

ధాన్యం దించుకోకుంటే చర్యలు



నవతెలంగాణ-వేల్పూర్

రైస్ మిల్స్‌లో ధాన్యం దించకుండా ఇబ్బంది పెడుతున్న రైస్ మిల్లర్ల పై చర్యలు తీసుకోవాలని రైతులు మంత్రి వేముల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన.. శనివారం వేల్పూర్‌లోని ఆయన నివాసం నుంచి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రైతులను ఇబ్బంది పెడుతున్న రైస్ మిల్స్ పై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా నిలవాలని, అన్నివిధాలా ఆదుకుంటామని అన్నదాతకు భరోసా అందించాలని సూచించారు. కడ్తా పేరిట రైతులను నష్టపర్చే మిల్లులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట మిల్లులకు తరలించి అన్ లోడింగ్ చేయించాలని ఆదేశించారు.

మారుతున్న సమీకరణాలు

- బాన్సువాడలో బీఆర్ఎస్ రాజకీయ సమీకరణాలపై జోరుగ చర్చ
- ఈసారి జహీరాబాద్ పార్లమెంట్ సీటు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌కు..?
- డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అసెంబ్లీకి పోటీ
- బీబీ పాటిల్‌ను మహారాష్ట్ర నుంచి పోటీకి దింపే అవకాశం!

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ రాజకీయ సమీకరణలు జోరుగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంట్లో భాగంగా మహారాష్ట్రలో పాగా వేసేందుకు పావులు కదుపుతున్నారు. దీంట్లో భాగంగా అక్కడ పోటీ చేసేందుకు సరిహద్దు నియోజకవర్గాల్లో ఉన్న నాయకులపై దృష్టి సారించారు. దీంట్లో భాగంగా సమీకరణలు మారుతున్నట్లు చర్చలు జరుగుతున్నాయి.

కాగా బాన్సువాడ నియోజకవర్గం నుంచి తరచూ విజయాలు సాధిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీలోకి దింపేందుకు కేసీఆర్ ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. కాగా బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గానికి స్పీకర్ తనయుడు, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డికి ఈసారి అవకాశం రానున్నట్టు వినిపిస్తున్నాయి. అయితే మహారాష్ట్రలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేసేందుకు ప్రస్తుత జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌ను మహారాష్ట్ర నుంచి పోటీలోకి దింపేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

బాన్సువాడ నియోజకవర్గంలో దీర్ఘకాలిక ఎమ్మెల్యేగా ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటు ఎంపీగాను ఇటు తనయుడు పోచారం భాస్కర్ రెడ్డి, లేదా పోచారం సురేందర్‌రెడ్డిలకు ఎమ్మెల్యే టికెట్ వస్తే అత్యధిక మెజార్టీతో ఇరువు గెలిపించే అవకాశం ఎక్కువ ఉందని పార్టీ సీనియర్ నాయకులు అభిప్రాయ వ్యక్తం చేస్తున్నారు.




పోచారం శ్రీనివాస్‌రెడ్డి


బీబీపాటిల్


భాస్కర్‌రెడ్డి


సురేందర్‌రెడ్డి

గతంలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తన మనసులో మాటను క్లిస్టల్ క్లియర్ చెప్పేశారు. బాన్సువాడ నుంచి వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ నుంచి తానే పోటీ చేస్తానంటూ క్లారిటీ ఇచ్చేశారు. ఇందులో ఎలాంటి అనుమానాలు పడాల్సిన అవసరం లేదన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవనం ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి టీడీపీ హయంలో మంత్రి గాను, బిఆర్ఎస్ హయాంలో మంత్రి గాను, స్పీకర్ గా విధులు నిర్వహిస్తున్నారు. పోచారం అనుభవాన్ని దృష్టిలో పెట్టుకున్న సీఎం కేసీఆర్ జహీరాబాద్ ఎంపీ టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలుస్తారనే ధీమాతో ఉన్నట్లు సమాచారం. బాన్సువాడ నియోజకవర్గ ప్రజలకు దీర్ఘకాలింగ సేవలు అందించిన పోచారం తనయుడు భాస్కర్ రెడ్డికి గెలిచే అవకాశాలు అధికంగా ఉన్నట్లు కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

టికెట్ ఎవరికి వచ్చిన గెలుపు బీఆర్ఎస్ దే..

వచ్చే పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఎవరికి వచ్చినా గెలుపు మాత్రం బిఆర్ఎస్ పార్టీదేనిని పలువురు నాయకులు వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పోచారం వారసుల్లో పోచారం సురేందర్ రెడ్డి తండ్రికి రైట్ హ్యాండ్ గా ఉంటూ.. ఇప్పటికే రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో తండ్రికి రాజకీయంగా సురేందర్‌రెడ్డి చేదోడుగా ఉంటున్నారు.

మరోవైపు చిన్న కుమారుడు భాస్కర్ రెడ్డి కూడా పాలిటిక్స్‌లో యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇప్పటికే భాస్కర్ రెడ్డి నిజామాబాద్ జిల్లా కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్‌గా వ్యవహరి స్తున్నారు. భాస్కర్ రెడ్డికి కూడా బాన్సు వాడ నియోజకవర్గంపై గట్టి పట్టుంది. పోచారం ఇద్దరు తనయులు బాన్సు వాడ నియోజకవర్గం లో మంచి పట్టు సాధించారు. నియోజకవర్గ కార్యకర్తలకు అండగా ఉంటున్నారు.

ఓ వైపు సర్వేల ఫలితాలు, ప్రజాస్పందన సీఎం కేసీఆర్ సూచనలు దృష్టిలో ఉంచుకుని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి క్లారిటీకి వచ్చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి తానే నిలబడతానని చెప్పుకొచ్చినా పార్టీ బలోపేతం చేసేందుకై రాజకీయ సమీకరణాలు తప్పవని నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తు న్నారు. కాగా ప్రస్తుత జహీరాబాద్ ఎంపీకి మహారాష్ట్రలో మంచి గుర్తింపు ఉంది. అక్కడి వారితో సత్సంబంధాలు కొనసాగి స్తున్నారు. దీంతో ఈసారి బీఆర్ఎస్ నుంచి మహారాష్ట్రంలో బీబీ పాటిల్‌ను పోటీలో నిలబెడితే గెలిచే అవకాశాలున్నట్టు సీఎం కేసీఆర్ భావిస్తున్నట్టు సీనియర్‌లు పేర్కొంటున్నారు.

మొక్కజొన్న మొత్తం కొంటాం

- మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి


మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్, ఎమ్మెల్యే

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

రాష్ట్రంలో రబీలో రైతులు పండించిన మొక్కజొన్న పంటను చివరి గింజ వరకు కొంటామని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి తెలిపారు. శనివారం నాడు పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ రబీలో రాష్ట్రంలో మొక్కజొన్న పండించిన రైతుల ఇబ్బందులను తెలుసుకొని కెసిఆర్ ఆదేశాలతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే హనుమాన్ షిండే మాట్లాడుతూ మొక్కజొన్న సాగు చేసిన రైతులు అధైర్య పడొద్దని, సాగుచేసిన మొక్కజొన్న చివరి గింజ వరకూ కొంటామని తెలిపారు. తెలంగాణ వచ్చిన తర్వాత, రాకముందు అభివృద్ధి ఎలా ఉందో ప్రజలు గమనించాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని రైతుల కోసం రైతుబంధు, లక్షల కోట్లతో ప్రాజెక్టుల నిర్మాణం, సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంతో పాటుగానే రైతుల పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ హనుమంత్‌రెడ్డి, డిసిసిబి డైరెక్టర్లు సాయిరెడ్డి, రామ్ పటేల్, స్థానిక సర్పంచ్ తిరుమల్‌రెడ్డి, ఉపసర్పంచ్ విట్టల్, విజయ్ దేశాయ్, కో ఆప్షన్ మెంబర్ జాఫర్ష, సింగిల్ విండోల చైర్మన్‌లు నారాయణరెడ్డి, శపథంరెడ్డి, మార్క్‌ఫెడ్ రంజిత్‌రెడ్డి, సీఈఓ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడే నీట్ పరీక్ష

- నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మెడికల్ కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ పరీక్ష-2023 (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ 2023) ఆదివారం మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5:20 నిమిషాల వరకు నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. నిజామాబాద్ జిల్లాలో 10 పరీక్ష కేంద్రాలలో 3183 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిజామాబాద్ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ మెరిగ తెలిపారు.

ఉదయం 11:30 నుండి మధ్యాహ్నం 1:30 నిమిషాల వరకు పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతిస్తారు. విద్యార్థులు ఒక పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో, మూడు పాస్ ఫోటో సైజ్ ఫోటోలు, కన్ఫర్మేషన్ పేజ్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఓటర్ కార్డ్ లాంటి ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబోరు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఎస్ఎస్ఆర్ డిస్కవరీ సిబిఎస్ స్కూల్ మాధవ నగర్, ఎస్ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్, నిషిత డిగ్రీ కాలేజ్, నాలెడ్జ్ పార్క్ స్కూల్, కాకతీయ ఇంజనీరింగ్ కాలేజ్, నవ్య భారతి గ్లోబల్ స్కూల్, ఆర్మూర్ పట్టణంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, క్షత్రియ ఇంజనీరింగ్ కాలేజ్, బోధన్ పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం నవీపేట్ మండలం జన్నేపల్లి, ఎస్ఎస్ఆర్ సీబీఎస్ఈ స్కూల్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. కాగా పరీక్షకు సంబంధించి ఆఫ్ సెంటర్ అబ్జర్వర్లకు చీఫ్ సుపెరిండెంట్‌లకు ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. పరీక్షా కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశామని నీట్ పరీక్షా కేంద్రానికి సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే 8978198421 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పాలకులు ఎంత దాడి చేస్తే అంత కంటే ఎక్కువ
కార్మిక వర్గం బలపడుతుంది

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య
- మేడే వారోత్సవాలు ముగింపు.. భారీ బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీలో ఎస్.వీరయ్య, నాయకులు..



సీఐటీయూ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

పాలకులు ఎంత దాడి చేస్తే అంతకంటే ఎక్కువ కార్మిక వర్గం బలపడుతుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన మే డే వారోత్సవాలు శనివారంతో ముగిసాయి. ముగింపు సందర్భంగా నగరంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి ధర్నా చౌక్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీలో ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య హాజరై మాట్లాడారు. 'మే డే అంతర్జాతీయ కార్మిక వర్గ ఐక్యతకు సంకేతం. కార్మిక వర్గ చైతన్యానికి ప్రతిరూపం. శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా వేలాది గొంతుకలు ఒకటైన కాలానికి నిలువెత్తు సాక్ష్యం. ఎనిమిది గంటల పని దినం కార్మిక హక్కుల కోసం నినదించిన మహోత్సవాల ఘట్టం. కార్మికుల రక్త తర్పణతో చరిత్ర లిఖించబడినది మేడే. మేడే పోరాటంలో చికాగో అమరవీరులు గర్జించిన ప్రపంచ కార్మికులారా ఏకంకండి అని నినాదం విశ్వవ్యాప్తంగా మారుమోగి శ్రామిక చైతన్యాన్ని రగిలి కొల్పిందని తెలిపారు.

మోడీ పాలనలో ఎనిమిదేండ్లుగా స్వదేశీ విదేశీ పారిశ్రామికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం 29 కార్మిక సంఘ చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తెచ్చారని దుయ్యబట్టారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పొడిగించేందుకు పీఎఫ్ నిధులతో సహా ఇన్సూరెన్స్, బ్యాంకింగ్ లలో వాటలను షేర్ మార్కెట్లో పెట్టి ఆధానీ లాంటి కార్పొరేట్లకు లబ్ధి చేకూరిలా నిర్ణయించినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో సకల శ్రామిక పోరాటాలు మేడే అమరవీరుల స్పూర్తితో నిజామాబాద్ కార్మిక వర్గం పోరాటాలను మరింత పదును పెట్టాలని, గ్రామీణ ప్రాంతంలో రైతు, వ్యవసాయ కూలీలు సామాన్య ప్రజలను కలుపుకొని ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మేడే స్పూర్తి ద్వారా ఐక్య పోరాటాలకు అంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు కటారి రాములు నరసయ్య , లిఫ్ట్ ఇరిగేషన్ నాయకులు గణేష్ మైపాల్ సందీప్గణేష్, కార్తీక్ ,సీతారాం నాయక్ ,మహిపాల్ ,సందీప్ ప్రవీణ్ ,నరేష్, బుచ్చన్న అవినాష్ ఇబ్రహీం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు సత్వరమే చెల్లించాలి

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సి.ఎస్ సమీక్ష





నిజామాబాద్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు.. కామారెడ్డి మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ కామారెడ్డి(తాద్వాయి)

రైతుల నుండి సేకరిస్తున్న ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన బిల్లులను సత్వరమే చెల్లించేందుకు చొరవ చూపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా అమలు చేస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమం, కంటి వెలుగు శిబిరాలను విరివిగా సందర్శిస్తూ, క్షేత్రస్థాయిలో ఇవి మరింత సమర్ధవంతంగా అమలు జరిగేలా చూడాల న్నారు. శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో వివిధ అంశాలపై సి.ఎస్ సమీక్ష నిర్వహించారు. డబుల్ బెడ్ రూమ్ పథకం తో పాటు కంటి వెలుగు, ఆరోగ్య మహిళా, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఎరువుల నిల్వలను సమకూర్చుకోవడం, జీ.ఓ నెం.లు 58 , 59 , 76, 118 అమలు, ఆయిల్ పామ్ లక్ష్య సాధన తదితర అంశాల ప్రగతిని సమీక్షించి సూచనలిచ్చారు.

ఈ విషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ, జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ. 600 కోట్ల విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలు చేశామని, అందులో రూ. 150 కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని సీ.ఎస్ దృష్టికి తెచ్చారు. ధాన్యం తరలించే వాహనాల రిజిస్ట్రేషన్ అంశాన్ని సైతం ఈసారి కొత్తగా ఓ.పీ.ఎం.ఎస్ నిబంధనల్లో చేర్చడం వల్ల బిల్లుల చెల్లింపుల్లో కొంత జాప్యం జరుగుతోందన్నారు. వచ్చే వారం నాటికి పెండింగ్ బిల్లుల చెల్లింపులన్నీ పూర్తి చేస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళలకు ప్రాధాన్యం

కామారెడ్డిలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ మాట్లా డారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం ఎర్రపాడు, బీర్కూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తు న్నామని తెలిపారు. ఈ శిబిరాలకు మహిళలు వచ్చే విధంగా గ్రామ సంఘాల సమావేశంలో ఐకెపి అధికారులు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. రైస్ మిల్లులకు సీ ఎం ఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని నిర్దిష్ట గడువులోగా మిల్లింగ్ జరిపి పౌర సరఫరాల శాఖకు బియ్యం నిల్వలు చేరవేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కంటి వెలుగు, ఆరోగ్య మహిళా కార్యక్రమాలకు అపూర్వ స్పందన లభిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే కంటి వెలుగు కార్యక్రమం 69 రోజులు పూర్తి చేసుకుందని, ఇదే తరహాలో మిగిలిన 31 రోజుల పాటు శిబిరాలను పకడ్బందీగా నిర్వహిస్తూ లక్ష్య సాధనకు కృషి చేస్తామన్నారు. ఆసుపత్రులను క్రమం తప్పకుండా సందర్శిస్తూ అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నమన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఏవో రవీందర్, ఆర్డీవో శీను, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రను మానుకోవాలి

- విద్యారంగం సమస్యల పరిష్కారంపై కమిటీ వేయాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు



మాట్లాడుతున్న నాగరాజు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రను మానుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. ఈ నెల 4వ తేదీ నుంచి నగరంలోని విశ్వశాంతి స్కూల్‌లో కొనసాగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు శనివారంతో ముగిసాయి. చివరి రోజు సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడారు. ఈ రాష్ట్ర కమిటీ సమావేశాలలో భవిష్యత్తు విద్యారంగ సమస్యలపై పోరుబాటకు నిర్ణయం చేశామని అన్నారు. రాష్ట్రంలో 2023-24 విద్యా సంవత్సరం అకాడమిక్ క్యాలెండర్ ప్రారంభం అవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యల పై ఉన్నత స్థాయి కమిటీతో అధ్యయనం చేయాలని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక విద్యార్థులు స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌లపై ఆధారపడి చదువుకుంటే రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడం విడ్డూరమని అన్నారు. భవిష్యత్తులో స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై అసెంబ్లీ ముట్టడికి సైతం పిలుపునిస్తామని అన్నారు. అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ పేరుతో హాస్టళ్లను తీసేయడం విద్యార్థులకు తీవ్ర నష్టమని అన్నారు. హాస్టళ్లను రక్షించు కునేందుకు విద్యార్థులంతా పోరాటానికి ఉద్యుతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రాజకీయాలను వీడి తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. జిల్లా విద్య రంగంపై చర్చించారు. అదే విధంగా సకాలంలో ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పెంచిన 25 శాతం మేస్ చార్జీలా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్య క్షులు తాటికొండ రవి , రజనీకాంత్, కిరణ్, రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాచకొండ విగ్నేష్ బోడ అనిల్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దీపిక, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలు మాని వేతనాలు చెల్లించండి

- వీసీ చాంబర్ ఎదుట అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ధర్నా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మీ రాజకీయాలు మాని తమకు ఏప్రిల్ నెల వేతనాలు చెల్లించాలని తెలంగాణ యూనివర్సిటీ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం టీయూలోని వీసీ, రిజిస్ట్రార్ చాంబర్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినెల 1, 2 తేదీల్లో తమ వేతనాలు బ్యాంకు అకౌంట్లలో జమ అయ్యేవని, 8 దాటిన ఇంతవరకు వేతనాలు రాలేదని వీసీ, రిజిస్ట్రార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు వచ్చే వేతనాలను నమ్ముకుని బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నామని, 2, 3 తేదీల్లో ఈఎంఐ కట్ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రూమ్ రెంట్, నిత్యావసర సరుకుల కొనుగోళ్లకు ఇబ్బందులు ఎదురవుతున్నా యన్నారు. మీ రాజకీయాలు మీరే చూసుకోండి, మా జీతాలు మాకు సకాలంలో వేయండంటూ వీసీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండున్నర గంటల పాటు టీయు పరిపాలన భవనం ఎదుట బైఠాయించి వీసీ, రిజిస్ట్రార్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనివర్సిటీ ఏర్పడినప్పటి నుండి వేతనాల చెల్లింపు సమస్య ఎప్పుడూ జరగలేదని వారు మండిపడ్డారు. వేతనాలు చెల్లిస్తేనే ఆందోళన విరమిస్తామని బైఠాయించారు. సోమవారం అందరికి వేతనాలు చెల్లిస్తామని వీసీ, రిజిస్ట్రార్లు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

వర్సిటీ అక్రమాలపై ఇంటలిజెన్స్ ఆరా.. ?

తెలంగాణ యూనివర్సిటీలో గత కొంతకాలంగా వీసీ అవినీతి అక్రమాలపై పాలకమండలి కమిటీని వేసిన దృష్ట్యా వాటిపై ఇంటలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నాయి. వర్సిటీలో ఎలాంటి అక్రమాలు జరగకపోతే వీసీ రవీందర్ గుప్తా కొత్త రిజిస్ట్రార్‌ను ఎందుకు, ఎలా నియమిస్తారని వారు ఆరోపిస్తున్నట్లు సమాచారం.

కంజర్ వాసి నటించిన సినిమాను వీక్షించిన బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ జిల్లా కంజర గ్రామానికి చెందిన యువ హీరో నటించిన 'గార్డ్ చిత్రాన్ని" ప్రసాద్ ల్యాబ్స్‌లో టీఎస్ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ శనివారం కుటుంబ సమేతంగా తిలకించారు. బాజిరెడ్డి జగన్మోహన్ ఈ చిత్రానికి సంబంధించి షూటింగ్‌కు తన సహాయ సహకారాలు అందించారు.


సినిమా హీరోతో బాజిరెడ్డి గోవర్ధన్

మొక్కజొన్న పంట పరిశీలన

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండలంలోని టాక్లి, దోమలెడ్గి గ్రామాలలో జిల్లా వ్యవసాయ అధికారి ఆర్.రమణ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు మొక్కజొన్న పంటలను శనివారం పరిశీలించారు.


పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

చాలీచాలని వేతనాలతో బతుకుతున్నాం

- **కొనసాగుతున్న వీవోఏల నిరసన**

నవతెలంగాణ-విలేకరుల బృందం

చాలీచాలని వేతనాలతో బతుకు వెళ్లదీస్తున్నామని, ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని వీవోఏలు డిమాండ్ చేశారు. శనివారం పలుచోట్ల వీవోఏలు నిరసన తెలిపారు.

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి, ఇందల్‌వాయి మండలాల వీవోఏల సమ్మె 13వ రోజులో భాగంగా మోకాళ్లపై నిలిచి తమ డిమాండ్ల సాధన పట్ల నినాదాలు చేశారు. ఇందల్‌వాయి వీఓఏ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శి సరళ, కె.రాము ఈ సందర్భంగా మాట్లాడుతూ వీవోఏ లు చాలీచాలని జీతాలతో నెలకు రూ.3900 తీసుకుంటూ కుటుంబాలను వెల్లదీస్తున్నారని పేర్కొన్నారు. జీతం కూడా మూడు నెలల్లో ఆరు నెలలకోకసారి ప్రభుత్వం చెల్లిస్తుందని, ఆ జీతం వారి కుటుంబ పోషణకు ఏ మూలనా సరిపోదని, ఇప్పటికైన వీవోఏలకు నెలకు రూ.18వేలు జీతం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉధ్యక్షురాలు సువర్ణ, కోశాధికారి మమత, సభ్యులు కవిత, సౌమ్య, అరుణ, స్వప్న, అలేఖ్య, రాధిక, లావణ్య, భాగ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కలిసిన వీవోఏలు..

భీంగల్ : తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు వేల్పూర్‌లోని మంత్రి తన నివాసంలో కలిశారు. అనంతరం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఐకేపీ కార్యాలయం ముందు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ప్రభుత్వం తమను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.18వేలు అందించాలని వారు నినాదాలు చేశారు. ఈ సమ్మెలో అధ్యక్షుడు రత్నాగౌడ్, లక్ష్మి, చింటుగౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలి..

సిరికొండ : గత 10 రోజులుగా నిరవధికంగా సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంఘం మండల అధ్యక్షులు సున్నపు స్వామి కోరారు. కార్యక్రమంలో ఏపీయం సత్యానంద్, సీసీలు రాజేందర్, నర్సయ్య, పుష్ప, శేఖర్, అకౌంటెంట్ నాగరాజు, సురేష్, ప్రభాకర్ సిబ్బంది మద్దతు తెలిపారు.


డిచ్‌పల్లి : మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు


కమ్మర్‌పల్లి : సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

కార్యక్రమంలో మూన్‌సింగ్, స్వామి, కవిత, వినోద్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమ్మెకు మల్లికార్జున్‌రెడ్డి సంఘీభావం..

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలో ఐకేపీ వీఓఏ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో పాల్గొని బాల్కొండ బీజేపీ నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు నుంచి ఇప్పటివరకు రూ.3900 మాత్రమే నెలవారి వేతనం చెల్లిస్తున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో మోర్తాడ్‌లో నిర్వహించిన టీఆర్ఎస్ బహిరంగ సభలో ఐకేపీ కార్మికులకు నెలకు రూ.10వేల కనీస వేతనం చెల్లిస్తామని, పసుపు, అల్లం కొమ్ములను ఐకేపీ సెంటర్ల ద్వారానే కొనుగోలు చేయిస్తామని కల్లిబొల్లి మాటలు చెప్పి కార్మికులను మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ మీటింగ్‌లకు, సభలకు జనం కావాలంటే మళ్ళీ ఈ ఐకేపీ సిబ్బందిని వాడుకుంటారని మండిపడ్డారు. ప్రభుత్వానికి బ్యాంకులకు మధ్య ప్రధాన అనుసంధానంగా ఉండేది ఐకేపీ వీవోఏలేనని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి ఐకేపీ వీవోఏలకు నెలకు కనీసం వేతనం రూ.18వేలు నేరుగా డీఆర్‌డీఏ ఖాతా వీవోఏల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రూ.10 లక్షల సాధారణ బీమా వర్తింపచేసి ఆదుకోవాలని, ప్రతీ ఐకేపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలన్నారు. ఐకేపీ కార్మికులు నిత్యం పని చేసేది మొబైల్ ఫోన్ నుంచే అని, ప్రతీ కార్మికునికి ప్రభుత్వమే మొబైల్ ఫోన్ కొనివ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికైనా వీళ్ళ డిమాండ్లు తెలుసుకొని బీఆర్ఎస్ పార్టీ సంబురాలలో నిమగ్నమైన ఎమ్మెల్యే, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు కట్ట సంజీవ్, బీజేపీ సీనియర్ నాయకులు రెంజర్ల గంగారాం, బీజేవైఎం మండల అధ్యక్షులు కొత్తపల్లి అరుణ్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు కుంట భూమారెడ్డి, కొమ్ముల సంతోష్, కమలాకర్, చిలివేరి వినోద్, శ్రవణ్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమ్మెకు బహుజన్ సమాజ్ పార్టీ మద్దతు..

ముప్కాల్ : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద గత 13 రోజులుగా వీవోఏలు తమ సమస్యలపై చేపడుతున్న నిరవధిక సమ్మెకు శనివారం బీఎస్పీ పార్టీ మద్దతు ఇవ్వడం జరిగిందని నియోజకవర్గ ఇంచార్జి గుంటి బెనర్జీ తెలిపారు. ప్రభుత్వం వారి సమస్యలను దృష్టిలో పెట్టుకుని మారుతున్న కాలానికి అనుగుణంగా వేతనాలు పెంచాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. గౌరవ వేతనం రూ.18వేలు, ఉద్యోగ భద్రత కల్పిస్తూ రూ.10లక్షల ఆరోగ్య, సాధారణ బీమా కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జీ గుంటి బెనర్జీ, అధ్యక్షులు సారంగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాంజీ చార్వక, ముప్కాల్ ఇంచార్జ్ సుంకే విక్రమ్, వీవోఏల సంఘం మండల అధ్యక్షురాలు అరుణ, వీవోఏలు మంజులత, కళావతి, భాగ్యలక్ష్మి, కావ్య, అర్చన, రాధిక పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) వీవోఏలుగా పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె నిర్వహించారు.

రూ.18వేలు జీతం ఇవ్వాలి..

మాక్లూర్ : మండలంలోని వివిధ గ్రామాల మహిళ సంఘాల వీఓఏలు తమకు నెలకు రూ.18వేలు జీతం ఇవ్వాలని శనివారం సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో మండల వీఓఏలు పాల్గొన్నారు.

13వ రోజుకు చేరిన వీవోఏల సమ్మె..

బోధన్ : తమ డిమాండ్ల సాధనకై చేస్తున్న ఐకేపీ వీవోఏల సమ్మె శనివారం నాటికి 13వ రోజుకు చేరింది. తెలంగాణ ఐకేపీ వీవోఏ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ సమ్మెలో బోధన్ మండలంలోని వీవోఏలు పాల్గొన్నారు. వీవోఏల సమ్మెకు మద్దతుగా ఐఎఫ్‌టీయూ మండల అధ్యక్షులు పోశెట్టి సంఘీభావం తెలిపారు. సమ్మెలో జిల్లా అధ్యక్షులు పోశెట్టి, మండలాధ్యక్షులు వెంకటేష్, రమేష్, విజయ్‌కుమార్, కరుణ, ధనలక్ష్మి, శ్రీలత, సునీత, పంచశీల తదితరులు పాల్గొన్నారు.

వర్ని : మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చందూర్, వర్ని మండలాలకు చెందిన ఐకేపీ వీఓఏల సమ్మె 13వ రోజుకు చేరింది. దీంతో వీవోఏలు తమ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని మోకాళ్ళపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెండు మండలాలకు చెందిన వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యం

- **ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి**

నవతెలంగాణ-ఆర్మూర్



సమగ్రా భివృద్ధి, సబ్బండవర్గాల సంక్షేమమే మన ఆయుధమని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గం ఆర్మూర్, ఆలూరు మండలాల్లోని పలు గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులతో జీవన్‌రెడ్డి అభివృద్ధి పనులపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్, ఇస్సాపల్లి, గగ్గుపల్లి, మిర్ధాపల్లి, అమ్దాపూర్, రాంపూర్, మంథిని, కోమన్‌పల్లి, ఖానాపూర్, పిప్రి, సుర్బిర్యాల్, చేపూర్, దేగాం గ్రామాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆయా గ్రామాల వారీగా ఆయన అభివృద్ధి పనులను సమీక్షించారు. మాక్లూర్ మండలంలోని వివిధ గ్రామాల నేతలతోనూ ఆయన విడివిడిగా సమావేశమై ఆయా గ్రామాల ప్రగతిపై రివ్యూ చేశారు. అలాగే ఆలూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులతోనూ జీవన్‌రెడ్డి సమావేశమై అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెలన్నీ అభివృద్ధితో కళకళలాడాలని దిశానిర్దేశం చేశారు. "గతంలో చేపట్టిన పనుల పురోగతి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన పనులన్నీ కాలపరిమితిలోగా పూర్తి కావాలని తెలిపారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు..

గ్రామాల్లో కొత్తగా చేపట్టాల్సిన పనులేమైన ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లో గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు నిర్మిద్దామని, ఏ గ్రామానికైనా సీసీ రోడ్లు, డ్రైనేజీల అవసరం ఉంటే చెప్పాలని వెంటనే నిధులు మంజూరు చేస్తానని వివరించారు.

బీఆర్ఎస్ నేత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే..

మండలంలోని అంకాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు మార భాజన్న మాతృమూర్తి ఇటీవల మృతిచెందడంతో జీవన్‌రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/బోధన్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ జీ.వో విడుదల చేయాలని పలు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని స్థానిక ధర్నాచౌక్ తొమ్మిదవ రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో అమలు చేస్తూ గ్రామాలు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో ప్రతి కార్యదర్శి ఎంతో క్రియాశీలకంగా పని చేశారన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు రావడానికి పంచాయతీ కార్యదర్శి ముఖ్య భూమిక పోషించాడని పేర్కొన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిన తమ సమస్యలైన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవోను విడుదల చేయాలని, గడిచిన నాలుగు సంవత్సరాల ప్రొహిబిషన్ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. అలాగే మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొని కుటుంబంలోని ఒకరికి కారుణ్య నియామకం చేపట్టాలన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జే.పీ.ఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ పనిచేసిన కాలాన్ని పరిగణించి రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శుల కేడర్ నిర్ధారించి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ అధ్యక్షులు అనిల్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి సుమన్, వైస్ ప్రెసిడెంట్ కృష్ణవేణి, పద్మావతి, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


నిజామాబాద్‌సిటీ : సమ్మెలో పాల్గొన్న జీపీ కార్యదర్శులు

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల వంటావార్పు..

బోధన్ : తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా శనివారం సమ్మెలో భాగంగా వంట వార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సమ్మెకు బీఎస్పీ బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి ఈశ్వర్ సంఘీభావం తెలిపారు. ఈ సమ్మెలో జూనియర్ పంచాయతీ అసోసియేషన్ నాయకులు రాజేశ్వర్, మహేందర్, సుధాకర్, బాలకృష్ణ, రాజీవ్‌గాంధీ, సతీష్, నాగార్జున, విశ్వనాథ్, రేష్మా హరిత తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదవ రోజుకు పంచాయతీ కార్యదర్శుల సమ్మె..

వేల్పూర్ : తమ డిమాండ్లను నెరవేర్చాలని చేపట్టిన పంచాయతీ కార్యదర్శుల సమ్మె తొమ్మిదవ రోజుకు చేరింది. సమ్మెలో వేల్పూర్ మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


బోధన్ : సమ్మెలో పాల్గొన్న జీపీ సిబ్బంది

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : తమ డిమాండ్ల సాధనకై ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామపంచాయతీ కారోబార్లు, సిబ్బంది యూనియన్ సమ్మె చేపట్టారు. శనివారానికి సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కారోబార్‌లు, సిబ్బంది కలిసి గ్రామపంచాయతీ కార్యదర్శులు యూనియన్ అధ్యక్షులు ఉదయ్ భాస్కర్ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఎడపల్లి మండలాధ్యక్షులు ఉదయ భాస్కర్‌తో పాటు కార్యదర్శులు సమ్మెలో కూర్చొని జీపీ కారోబార్లకు సిబ్బందికి పూర్తి మద్దతు పలికారు. ఈ సందర్భంగా యూనియన్ ఎడపల్లి మండల అధ్యక్షులు రాజు మాట్లాడారు. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బంది అందరికీ 51జీవోను సవరించి కేటగిరీల వారిగా సఫాయి పంపు ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్ ట్రాక్టర్ డ్రైవర్ కల్పించి కనీస వేతనం రూ.15,500 మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో పాండు, రహిమత్, గుణతేజ, లక్ష్మణ్, సాయిలు, రాజు, అబ్దుల్ రహీం, గంగారం, ఆయా గ్రామాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పంచాయతీ కార్మికులు..

బోధన్ : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గ్రామపంచాయతీ కారోబార్స్, స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కారోబార్లను, బిల్ కలెక్టర్లను సహాయ పంచాయతీ కార్యదర్శిగా హోదా కల్పించి రూ.20,500 వేతనం మంజూరు చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి 51జీవోను అనుసరించి వారికి ప్రత్యేక హోదా కల్పించి రూ.15,500ల వేతనం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలని, వేతనాలను ప్రభుత్వమే నేరుగా సిబ్బంది ఖాతాలో జమ చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, మరణించిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో యూనియన్ అధ్యక్షులు గణేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి శరత్, కోశాధికారి పోశెట్టి, వీరేశం, బాలకృష్ణ, విజయ్, లక్ష్మి, సక్కుబాయి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె..

మాక్లూర్ : మండలంలోని గ్రామపంచాయతీ కారోబార్లు, సిబ్బంది యూనియన్ తమ సమస్యల సాధనకై శనివారం రెండో రోజుకు సమ్మె చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కారోబార్లు, వాటర్ మ్యాన్‌లు, డ్రైవర్, ఎలక్ట్రీషన్లు, స్వీపర్లు తమ సమస్యల సాధన కొరకు మండల కార్యాలయం ముందు టెంట్ వేసుకొని సమ్మె ప్రారంభించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆర్.బాలకిషన్, జిల్లా అధ్యక్షులు, సుధాకర్, కార్యదర్శి నర్సారెడ్డి, క్యాషన్, బాలరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వేల్పూర్ : మండలం కేంద్రంలో జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట రెండవ రోజు కారోబార్, గ్రామపంచాయతీ, వాటర్‌మెన్, ఎలక్ట్రీషియన్, ట్రాక్టర్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు చిట్టిబాబు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీలో పని చేస్తున్న సిబ్బంది అందరికీ 51జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు వంశీ, ఉపాధ్యక్షుడు తలారి సాయన్న, ప్రధాన కార్యదర్శి సంజీవ్, ప్రచార కార్యదర్శి రాజు, ఆయా గ్రామ పంచాయతీ కారోబార్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, ఎలక్ట్రీషన్, వాటర్‌మెన్, ట్రాక్టర్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది సమ్మెకు కాంగ్రెస్ నాయకుల సంఘీభావం..

కమ్మర్‌పల్లి : సమస్యల పరిష్కారం కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ సిబ్బందికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సుంకెట రవి ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. మండల కేంద్రంలోని 63వ నెంబర్ జాతీయ రహదారి పక్కన హాసకొత్తూర్ చౌరస్తా వద్ద తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని కాంగ్రెస్ నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుచ్చి మల్లయ్య, సుంకెట శ్రీనివాస్, మండల గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బాజే సాహెబ్, రమేష్, భరత్ కుమార్, మండల సపాయిలు, ఎలక్ట్రీషన్, పంపు ఆపరేటర్స్ సిబ్బంది పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి : కాంగ్రెస్ నాయకుల సంఘీభావం

పంచాయతీ సిబ్బంది సమ్మెకు బీజేపీ మద్దతు..

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో పాల్గొని బాల్కొండ బీజేపీ నాయకులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు కట్ట సంజీవ్, బిజెపి సీనియర్ నాయకులు రెంజర్ల గంగారాం, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు కుంట భూమారెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షులు కొత్తపల్లి అరుణ్, కొమ్ముల సంతోష్, కమలాకర్, బోండ్ల దుర్గయ్య, చిలివేరి వినోద్, శ్రవణ్, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో పంచాయతీ సిబ్బంది

మోపాల్ : మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ సిబ్బంది, కారోబార్లు సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కారోబార్ల సంఘం మండలాధ్యక్షుడు నందు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు, అరుణ్, విజయ్, ప్రదీప్, సతీష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కులమత రహిత సమాజం నిర్మించేది విద్యార్థినే

నవతెలంగాణ-కంఠేశ్వర్



కుల మత రహిత సమాజం నిర్మించేది విద్యార్థులేనని కేర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ తెలిపారు. శనివారం నగరంలోని కేర్‌డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్‌డే కార్యక్రమాన్ని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చివరి సంవత్సరం విద్యార్థుల కొరకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రముఖ నృత్య దర్శకులు సోను, చరణ్, ప్రశాంత్ విద్యార్థులచే అద్భుతమైన నృత్యాలు చేయించారు. కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్ మాట్లాడుతూ.. విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు భారతీయులవుతారు కాని హిందూ ముస్లిం క్రిస్టియన్లు కారు అని అన్నారు. విద్యార్థి దశలోనే దేశభక్తి నిండుగా ఉంటదని గుర్తు చేశారు. మంచిగా చదువుకొని జీవితంలో సక్సెస్ సాధించి దేశం రుణం తీర్చుకోవాలని అన్నారు. అనంతరం చేసిన నృత్యాలు అందర్నీ అలరించాయి. కార్యక్రమంలో కేర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ నరాల సుధాకర్, నరాల స్వప్న ప్రిన్సిపాల్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, కొయ్యాడ శంకర్, సందేష్, సందీప్, సీనియర్ అధ్యాపకులు కళ్యాణి, సలేహ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువు కోసం ఆర్థికసాయం

నవతెలంగాణ-కంఠేశ్వర్

పద్మశాలి మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో ఓ పేద విద్యార్థి చదువు కోసం ఆర్థికసాయం అందజేశారు. నిజామాబాద్ నగరంలోని కోటగల్లికి చెందిన రాజేందర్ ఇటీవల మరణించగా డిగ్రీ చదువుతున్న అతడి కొడుకు చదువు ఆగిపోకుండా రూ.5వేలు రాజేందర్ భార్యకు శనివారం అందించారు. పద్మశాలి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, సేవా సంఘం ప్రతినిధులు విజయ, కొండి సుధ, పుట్ట రుక్మిణి, పద్మశాలి ఆత్మీయ సేవా సమితి డైరెక్టర్ చింతల గంగాదాస్ పాల్గొన్నారు.

లింక్ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-నందిపేట్

మండలంలోని వెల్మల్ గ్రామంలో పలు గ్రామాలను కలుపుతూ లింక్ రోడ్డు పనులను స్థానిక నాయకులు, ఎంపీడీవో నాగవర్ధన్ ఉపాధిహామీలో భాగంగా పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతీయ ఉపాధిహామీ కింద ప్రజలకు పనిదినాలు కల్పించి వెల్మల్ నుంచి నందిపేట్ గ్రామాన్ని కలుపుతూ.. వెల్మల్ నుంచి జోర్పూర్, కుద్వాన్‌పూర్ గ్రామాలను కలుపుకుని 30 ఫీట్ల వెడల్పుతో మట్టి రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ లింక్ రోడ్లతో ఆయా గ్రామ ప్రజలు, రైతులు వారివారి పంటపొలాలకు సులువుగా వెల్లవచ్చన్నారు. మండల కేంద్రానికి తక్కువ సమయంలో దూర భారం తగ్గి ఈ ప్రాంత ప్రజలు తొందరగా చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవేందర్, ఉప సర్పంచ్ నారాయణ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రాము, బీఆర్ఎస్ నాయకులు పెద్దగంగారం, పోతన్న, విజయ్, అశోక్, ముత్తెన్న రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత, పొదుపు వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీపీ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో విద్యుత్ భద్రత, పొదుపు వారోత్సవాలలో భాగంగా ముఖ్య అతిథిగా ఎంపీపీ మస్తా ప్రభాకర్ పాల్గొని పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాల నుంచి అధికారుల సూచనలు పాటిస్తూ ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అజాగ్రతతో వ్యవహరించి, వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శంకర్‌గౌడ్, ఎంపీటీసీ ఒడ్డెన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బడుగు సత్యం, విద్యుత్ అధికారి ఏడీ అశోక్, ఏఈ గోపి, గ్రామ విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఏర్గట్ల

రైతుబీమా తరహాలో ప్రతి గీత కార్మికుడికి 5లక్షల గీత కార్మికుల బీమాను సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ఏర్గట్ల మండలానికి చెందిన గౌడ కులస్తులు మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కల్లుగీత కార్మికులు ప్రమాదం జరిగి చనిపోతే వారి కుటుంబాలకు అండగా ఉండాలని సీఎం కేసీఆర్ 5లక్షల ప్రమాదబీమా ప్రకటించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ సందర్భంగా గౌడ కులస్తుల తరపున సీఎం కేసీఆర్, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో గౌడ కులస్తులు తుపాకుల శ్రీనివాస్‌గౌడ్, సుధనవేణి శ్రీనివాస్‌గౌడ్, బాలాజీగౌడ్, రాజుగౌడ్, హరీష్‌గౌడ్, బాలాగౌడ్, వెంకటేష్ గౌడ్, గన్నారపు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల చట్టాలపై అవగాహన సదస్సు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.వైజయంతి నిజామాబాద్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ పి.లక్ష్మీనర్సయ్య ఆదేశాల మేరకు న్యాయసేవా సదన్ హాల్లో నిజామాబాద్ డివిజన్లోని పోలీస్ అధికారులకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేశ్ గౌడ్ ఆధ్వర్యంలో నిజామాబాద్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. మాదక ద్రవ్యాల ఎన్‌డీపీఎస్ యాక్ట్ గురించి ప్రథమ సమాచార సేకరణ నుంచి కోర్టులో చార్జిషీటు వరకు జరుగుతున్న లోపాల గురించి అవలంబించవలసిన పద్ధతులు సాక్షుల సేకరణ విధానం గురించి వివరంగా తెలిపారు. కేసులలో నేరస్థులను శిక్ష పడేటట్టు అవలంబించవలసిన పద్ధతులు తెలిపారు. తప్పు చేసిన వ్యక్తికి తప్పకుండా శిక్ష పడేటట్లు చూసే బాధ్యత పోలీస్ అధికారులకే ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికారి పెండ్యాల పద్మావతి, నిజామాబాద్ జిల్లా ప్రాసిక్యూటర్ పి.రవిరాజ్, కవితరెడ్డి, వసంత్‌కుమార్, నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్‌కుమార్, డివిజన్ సీఐలు, ఎక్సైజ్ స్టేషన్ ఆఫీసర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు మార్చండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు మార్చాలని 49వ డివిజన్ కార్పొరేటర్ మెట్టు విజయ అన్నారు. నగరంలోని గాంధీచౌక్ దగ్గరలోని అంబారీపేట్ ట్రాన్స్‌ఫారం కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని ఈ విషయమై ఏడీఈకి, ఏఈకి ఎన్నిసార్లు చెప్పినా విన్నవించుకోవడం లేదని, షాపింగ్‌కు వచ్చే వారికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ట్రాన్స్‌ఫారాన్ని డ్రైనేజీ దగ్గర ఏర్పాటు చేయడంతో ఎలుకలు, పందికొక్కులు తవ్వడంతో ఎలక్ట్రిక్ పోల్‌లు కుంగిపోతుందని, గతంలో ఇద్దరు వ్యక్తులు చనిపోయారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫారం ఇక్కడి నుంచి పక్కకు మార్చి దృఢంగా, కుంగిపోకుండా ఉండేవిధంగా ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ కోరారు.

తెలంగాణలో తుగ్లక్ పాలన

నవతెలంగాణ-వర్ని

తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పాలన తుగ్లక్ పాలనగా మారిందని బీజేపీ ఉమ్మడి జిల్లాల కార్యదర్శి నర్సాగౌడ్ ఘాటుగా విమర్శించారు. శనివారం వర్ని మండల కేంద్రంలోని వీఎంఆర్ గార్డెన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పలు రకాలుగా పంట నష్టపోయి ధాన్యం చేతికి అందకుండా అకాల వర్షాలకు నేలపాలవుతున్నా సీఎం కేసీఆర్ స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి మల్యాద్రిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అరుణతార, మండలాధ్యక్షులు శంకర్, మోస్రా మండల అధ్యక్షులు భూపాల్‌రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం


సాయికుమార్‌కు సన్మానం

నవతెలంగాణ-గాంధారి
గాంధారి మండల కేంద్రానికి చెందిన పిఏసిఎస్ చైర్మన్ పెద్దబూరి సాయికుమార్‌కు దళిత రత్న అవార్డు వచ్చిన విషయం విధితమే. రజక సంఘం నాయకులు శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి, రజక, జిల్లా అధ్యక్షులు జువ్వాడి శ్రీకాంత్, మండల అధ్యక్షులు సంగెం బాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి సాయిరాం, జిల్లా నాయకులు శ్రీనివాస్, మోహన్,మహేష్, క్రిష్ణ, నరేష్, నిఖిల్, సాయిరాం, కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల డిమాండ్‌లు నెరవేర్చాలి

- కాంగ్రెస్ మద్దతు


నినాదాలు చేస్తున్న వీవోఏలు, నాయకులు

నవతెలంగాణ-పిట్లం
వీవోఏల న్యాయమైన డిమాండ్‌లను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. వీవోల రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. పిట్లం మండల పరిషత్ కార్యాలయం ఎదుట వీరి దీక్షలకు సంఘీభావంగా కాంగ్రెస్ నాయకులు కూర్చొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంబిగి హన్మాండ్లు , మాజీ సర్పంచ్ హన్మా గంగారం , సింగిల్ విండో వైస్ చైర్మన్ సాయిలు , సూరత్ వంత్ రెడ్డి , కృష్ణారెడ్డి , గొల్ల విట్టల్ , సంతోష్ రెడ్డి , రాజశేఖర్ రెడ్డి , రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్ డొనేషన్ క్యాంపు

నవతెలంగాణ-సదాశివనగర్
సదాశివనగర్ మండల కేంద్రంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఔత్సాహికులు రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భరోసా పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని పలు గ్రామాల్లో శనివారం డీఎస్‌పీ ఆధ్వర్యంలో తెలంగాణ భరోసా పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండలంలోని భూంపల్లి, లింగంపల్లి, దర్మారావుపేట్ జనగామ తదితర గ్రామాల్లో ఆవిష్కరించారు. ఈ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మొగ్గం నవీన్, ఉపాధ్యక్షుడు నందిపేట్ సాయిలు, కార్యదర్శి రాజు, సంతోష్, రాజనర్సు పాల్గొన్నారు.

నవతెలంగాణ విలేకరికి పరామర్శ



తిరుపతితో మాట్లాడుతున్న తోటి విలేకరులు

నవతెలంగాణ-ఆర్మూర్
ప్రమాదవశాత్తు గాయపడ్డ నవతెలంగాణ ఆర్మూర్ విలేకరి సొక్కల తిరుపతిని ఆర్మూర్‌లోని మామిడిపల్లిలోని ఆయన నివాసంలో శనివారం నవనాథపురం ప్రెస్‌క్లబ్ సభ్యులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. ప్రెస్‌క్లబ్ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో గౌరవ అధ్యక్షుడు సత్పుతే శ్రీనివాస్, అధ్యక్షుడు సుంకరి గంగమోహన్, ఉపాధ్యక్షుడు సంజీవ్ పార్దేమ్, సలహాదారుడు గణేష్ గౌడ్, సభ్యులు, మాజీ అధ్యక్షుడు మంచిర్యాల నరేందర్, అమృతల శ్రవణ్, గోజుర్ మహిపాల్, యమ్మాజీ చేరణ్ గౌడ్, గోలి పురుషోత్తం తదితరులున్నారు.

వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి


- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేశ్‌బాబు


వీవోఏల రిలే దీక్షలకు సంఘీభావంగా కూర్చున్న రమేశ్‌బాబు

నవతెలంగాణ-వేల్పూర్
వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రమేశ్‌బాబు డిమాండ్ చేశారు. వేల్పూర్ మండల కేంద్రంలో ఐకేపీ వీవోఏలు చేపట్టిన రిలే దీక్షల సమ్మె శిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ప్రభుత్వం నిర్వహించే అనేక కార్యక్రమాల్లో మహిళలకు ప్రభుత్వానికి చేదోడు వాదోడుగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే వీవోఏల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వం కింది తరగతి కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయటం బాధ్యతారహితమని అన్నారు. ప్రభుత్వం స్పందించే వరకూ ఐకేపీ వీఎలేల ఆందోళనలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి నజ్మా, జిల్లా కోశాధికారి ఎం సుదర్శన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం అరుణ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఏం మంజీరా, జిల్లా సలహాదారురాలు మురళీమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు, వేల్పూర్ మండల ఐకెపి వివోఎలు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువకుడి ఆత్మహత్య

- పీజీ చదివినా ఉద్యోగం రాక బలవన్మరణం


భావెన్

నవతెలంగాణ-భిక్కనూర్
పీజీ చదువుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూసి నోటిఫికేషన్లు రాక, తాను చదువుకున్న చదువుకు సరైన ఉద్యోగం దొరకక తీవ్ర మనస్థాపం చెంది పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసున్నాడు. ఈ ఘటన మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన భావెన్ (28) ఎంబీఏ చదువుకొని ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేశాడు. తాను చదువుకున్న చదువుకు సరైన ఉద్యోగం దొరకకా, అప్పుల బాధలు ఎక్కువై సిద్ధ రామేశ్వర ఆలయం వెనుక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుని తన స్నేహితునికి ఫోన్ చేసి తెలిపాడు. విషయాన్ని స్నేహితుడు కుటుంబ సభ్యులకు తెలుపగా కుటుంబీకులు ఘటన స్థలానికి చేరుకుని బావెన్ ను కామారెడ్డి ఏరియా హాస్పిటల్ తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎల్లారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా శనివారం తెల్లవారుజామున మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు.

ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- కొనసాగుతున్న జేపీఎస్‌ల రిలే దీక్షలు
- బతుకమ్మ ఆడుతూ జేపీఎస్‌ల నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం
నాలుగేండ్ల ప్రొబేషన్ పీరియడ్ ముగిసినందున తమను వెంటనే రెగ్యూలర్ చేయాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్‌లు) చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. రిలే దీక్షల్లో భాగంగా వినూత్న పద్ధతిల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. వారు చేపట్టిన సమ్మె శనివారంతో 9వ రోజుకు చేరుకుంది.

బతుకమ్మ ఆడుతూ నిరసన
గాంధారి :జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ శనివారం మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో జేపీఎస్‌ల నిరసన కొనసాగింది. మహిళా పంచాయతీ కార్యదర్శులు బతుకమ్మ ఆడుతూ నిరసన చేపట్టారు. ప్రభుత్వం వెంటనే 4 సంవత్సరాల కాలన్ని, సర్వీసుగా గుర్తించి వెంటనే గ్రేడ్ 4 సెక్రెటరీగా చేయాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండలంలోని జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జేపీఎస్ సమ్మెకు మద్దతు
జుక్కల్: తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చాలని కోరుతూ మండల కేంద్రంలో శాంతియుతంగా చేపట్టిన జేపీఎస్‌ల సమ్మె కొనసాగుతోంది. వీరి సమ్మెకు రోజురోజుకూ పలువురి మద్దతు లభిస్తుంది. పెద్దఎడ్గి గ్రామంలోని యువజన సంఘం సబ్యులు సంఘీభావం తెలియజేస్తూ ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా యూత్ నాయకుడు అస్పత్ వార్ రవీందర్, బాలు మాట్లాడుతు నేటితో తొమ్మిదవ రోజుకు వారి దీక్షలు చేరాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే వారిని క్రమబద్ధీకరించాలని కోరారు. జేపీఎస్‌ల సమ్మెతో గ్రామాలలో ధ్రువీకరణ పత్రాలు నిలిచిపోయాయని, పారిశుధ్య పనులు, ఇతర కార్యక్రమాలు పెండింగ్ పడటం వలన సమస్యలు తీవ్రమవుతున్నాయని తెలిపారు. మరింత జఠిలం కాకముందే వారి డిమాండ్‌లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షంషోద్దిన్, రవీందర్, బాలు, పరమేష్, లక్ష్మన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో జేపీఎస్‌లకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి : సీఐటీయూ
జుక్కల్: మండలంలోని జేపీఎస్‌లు చేస్తున్న శాంతియుత రిలే దీక్షకు మద్దతుగా సీఐటీయూ జిల్లా నాయకులు సురేశ్ గొండ దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నిండు అసెంబ్లీలో జేపీఎస్‌లకు ఇచ్చిన హామీని వెంటనే పరిష్కరించి మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు అడేప్పా, తదితరులు పాల్గొన్నారు.


గాంధారిలో బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న జేపీఎస్‌లు

జేపిఎస్‌ల ఆర్థిక సాయం
జుక్కల్: జేపిఎస్‌లు శాంతియుతంగా న్యాయమైన డిమాండ్ల కోసం చేస్తున్న సమ్మెకు మద్దతుగా బిచ్కుందలోని లక్ష్మీ తేజ వాటర్ సర్వీసెంగ్ సెంటర్ , పోలో మెడికల్ షాప్ యజమాని జుక్కల్ మండలం చండేగాం వ్యాస్తవ్యుడు సోన్ కాంబ్లే బాలాజీ సంయుక్తంగా కలిసి ఐదు వేల రూపాయలు ఆర్థిక సాయంగా అందజేశారు. దీక్ష శిబిరంలో సంఘీభావంగా కూర్చున్నారు.

సెక్రెటరీల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మద్దతు
పిట్లం: జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు నిర్వహిస్తున్న శాంతియుత సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మద్దతు తెలిపారు. మండల పరిషత్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలకు సంఘీభావంగా కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంచాయతీ జూనియర్ సెక్రటరీలకు ఇచ్చిన హామీ మేరకు వారి ఉద్యోగాలను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంబిగి హన్మాండ్లు, మాజీ సర్పంచ్ హన్మా గంగారం, సింగిల్ విండో వైస్ చైర్మన్ సాయిలు, సూరత్ వంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గొల్లవిట్టల్, సంతోష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



జుక్కల్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు సురేశ్ గొండ.. ఆర్థిక సాయం అందజేత


పిట్లంలో కాంగ్రెస్ మద్దతు

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-గాంధారి/పిట్లం
గాంధారి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు మండలంలోని పొతంగల్ ఖుర్దు, పెట్ సంగెం, మాతుసంగెం, బ్రమ్మణపల్లి, గుర్జల్, గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ రాధబలరాం, జడ్పీటీసీ శంకర్ నాయక్‌లతో కలసి గాంధారి పిఏసిఎస్ చైర్మన్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎన్ డిసీసీబి, ఐడిసిఎంఎస్ డైరెక్టర్ పెద్దబూరి సాయికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ముకుంద్ రావు, తహశీల్దార్ గోవర్ధన్, ఆర్ఐ నర్సింహారెడ్డి, ఏవో నరేష్, ఎంపీటీసీలు తూర్పు రాజులు, పత్తి శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యుడు ముస్తఫా, సొసైటీ వైస్ చైర్మన్ ఉదల్ సింగ్, సొసైటీ డైరెక్టర్లు ధోల్లు సాయిలు, గాండ్ల లక్ష్మణ్, తాడ్వాయి సంతోష్ కుమార్, ఆర్ల శివాజీ రావు తదితరులు పాల్గొన్నారు.


గాంధారిలో..


పిట్లం మండలంలోని అన్నారంలో..

కొనుగోలు కేంద్రాలతో రైతులకు లబ్ధి
పిట్లం:ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలతోనే రైతులకు లబ్ధి చేకూరుతుందని సింగిల్ విండో చైర్మన్ శపథం రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చిల్లర్గి సింగిల్ విండో పరిధిలోని అన్నారం గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నారం వెంకట్రామిరెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి, ప్రభుత్వ మద్దతు ధరను లబ్ది పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాశీరాం, ఎంపీటీసీ హన్మాండ్లు, పార్టీ సీనియర్ నాయకులు హన్మంత్ రెడ్డి , జగన్నాథ్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఖాతాల్లోకి నేరుగా ధాన్యం డబ్బులు

- దుర్కి సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-నసురుల్లాబాద్
రైతులు పండించిన ప్రతిగింజను కొంటామని, కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతు ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తున్నామని సహకార సంఘం చైర్మన్ దివిటి శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. శనివారం దుర్కి సహకార సంఘంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. నసురుల్లాబాద్ మండలం దుర్కి సహకార సంఘం పరిధిలో 90 వేల బస్తాలు 40,వేల క్వింటాళ్ల ధాన్యం ఇప్పటి కొనుగోలు చేశామని, ఇందులో ఎనిమిది కోట్లకు మూడు కోట్ల 50 లక్షల రూపాయలను రైతు ఖాతాలో జమ చేశామన్నారు. ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులకు ఈ అకాల వర్షం కన్నీరు పెట్టించిందని, బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ, జిల్లా అధికారుల సహకారంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ముమ్మారంగ కొనసాగుతున్నట్టు తెలిపారు. ఒకవైపు భారీ వర్షాలు మరోవైపు రైతుల అష్ట కష్టాలను చూసి ఎండిన ధాన్యం ను కొనుగోలు చేయాలని సంకల్పంతో దుర్కి సహకార సంఘం పరిధిలో 15 కాంటాలు, 150 మంది హమాలీలతో రాత్రి పగలు అని తేడా లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

తడిసిన ధాన్యం శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఇతర జిల్లా అధికారులు పరిశీలించారని, వారి సహకారంతో దానిని కొనుగోలు సైతం చేపట్టినట్టు తెలిపారు. నేటి వరకు 40 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 8 కోట్ల రూపాయల్లో ఇప్పటికే మూడు కోట్ల 50 లక్షల వరకు రైతు ఖాతాలో జమ చేశామని ఆయన అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.


మాట్లాడుతున్న దుర్కి సొసైటీ చైర్మన్

పారిశుధ్యంపై సామాజిక బాధ్యత ఉండాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్
ప్రతి ఒక్కరు పారిశుద్ద్యం పై సామాజిక బాధ్యత కలిగివుండి తద్వారా పరిసరాల పరిశుభ్రత పాటించాలని బాన్సువాడ డివిజన్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. శనివారం బీర్కూరు మండల్ పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక అధికారులతో పాటు స్థానిక మహిళలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. బీర్కూర్ గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పాటించకపోవడంతో అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బుధవారం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డిఎల్పిఓ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం క్షీణించి, దోమలు విజృంభించి సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యల్లో భాగంగా పారిశుధ్య కార్మికులతో గ్రామంలో మురికి కాలువలు అపరిశుభ్రతను తొలగింపు పనులు చేపట్టినట్టు తెలిపారు.

శనివారం బీర్కూరు మండలం కేంద్రాన్ని బాన్సువాడ డిఎల్పిఓ శ్రీనివాస్ సందర్శించారు. వివిధ వాడలో ఆయన తిరిగి మురికి కాలువను శుభ్రం చేయాలని సూచించారు. ప్రతి రోజు ఇంట్లో నుండి వచ్చే చెత్తను వీధుల్లో వేయకుండా చెత్త డబ్బాలను ఉపయోగించుకోవాలని సూచించారు. వీరి వెంట ఎంపీడీవో భాను ప్రకాష్ గ్రామ సర్పంచ్ పంచాయతీ వర్గ సభ్యులు అధికారులు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న అధికారులు

యువత సన్మార్గంలో నడవాలి

- సప్తలో ఎమ్మెల్యే షిండే

నవతెలంగాణ-జుక్కల్
ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడుచుకోవాలని అప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయగలుగుతారని ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. మండలంలోని నాగల్‌గావ్ గ్రామంలో శనివారం సప్త ముగింపు కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెలే హన్మంత్ షిండే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెలే షిండేను గ్రామ సర్పంచ్ కపిల్ పాటిల్ స్వాగతం పలికి ఆహ్వానించారు. గ్రామస్తులు శాలువ, పుష్పగుచ్చాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే కీర్తన, భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఎమ్మెలే హన్మంత్ షిండే మాట్లాడుకు యువత సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ నాగలగిద్దే శివానంద్, సర్పంచ్ కపిల్ పటేల్, మాజీ సర్పంచ్ అనీల్, గ్రామస్తులు ఆశోక్ పటేల్, బాబు పటేల్, నాయకులు సాయాగౌడ్, నీలుపటేల్, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే షిండేకు సన్మానం

బూత్ లెవల్ ఏజెంట్‌లను నియమించాలి

- రాజకీయ పార్టీలకు కలెక్టర్ సూచన


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డిడెస్క్
రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఓటర్ల జాబితాలలో మృతి వారి పేర్లు తొలగింపు పై రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వారిగా మృతి చెందిన వారి పేర్లను తొలగించాలని తెలిపారు. బూత్ ఏజెంట్లు తమ బూత్ పరిధిలో పది మంది ఫారంలను మార్పులు, చేర్పుల కోసం బూత్ లెవెల్ అధికారికి ఇవ్వవచ్చని చెప్పారు. ఒక వ్యక్తికి నాలుగు ఓట్లు ఉంటే వాటిని గుర్తించి మూడు తొలగించే విధంగా చూడాలని రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. ఒక ఇంటిలో ఐదు ఓట్లు ఉంటే వారి పేర్లు ఒకే వార్డులో కాకుండా ఇతర వార్డుల్లో వచ్చాయని రాజకీయ పార్టీల నాయకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఒకే ఇంటిలో ఉండే ఐదుగురు ఓటర్లు అదే వార్డులో ఉండే విధంగా బూత్ లెవల్ అధికారికి దరఖాస్తు చేసుకునే విధంగా చూడాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి, పరిష్కారం చేయిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎన్నికల పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, అధికారులు , వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పేద మైనారిటీ మహిళకు సహారా ఫౌండేషన్ చేయూత


ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-పిట్లం
రోడ్ యాక్సిడెంట్లు గాయపడిన పేద మైనారిటీ మహిళను సహారా ఫౌండేషన్ ప్రతినిధులు పరామర్శించి తగిన చేయూతనందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ మండలంలోని పోతు రెడ్డి పల్లి గ్రామానికి చెందిన పేద మైనారిటీ మహిళ మైహిబూబా ఇటీవలి కాలంలో రోడ్డు ప్రమాదంలో గాయాపాలు కావడంతో పరామర్శించి ఆర్థిక సాయం అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సహారా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తో మూడు గేదెలు మృత్యువాత



నవతెలంగాణ-సిరికొండ
మండలంలోని కొండపూర్ గ్రామంలో శనివారం విద్యుత్ తీగలు తగిలి మూడు గేదెలు మృతి చెందాయని గ్రామ సర్పంచ్ రమేష్ తెలిపారు. గ్రామానికి చెందిన మిద్దెల లచ్చయ్య రెండు గేదెలు, బొడ్డు రాములుకు చెందిన ఒక గేదె గ్రామంలోని వ్యవసాయ పంట పొలాలకు వెళ్లే విద్యుత్ సరఫరా తీగలు తగలడంతో గేదెలు మృతి చెందాయన్నారు. మృతి చెందిన గేదెల బాధితులకు ప్రభుత్వపరంగా న్యాయం చేస్తామని సర్పంచ్ తెలిపారు.

మైనారిటీ కమిషన్ చైర్మన్ తారీక్ అన్సారీకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తారిక్ అన్సారీని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా శనివారం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ కుద్దుస్, ముజాహిద్ బబ్బు, అక్తర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే

నేడు బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-ముప్కాల్

రూ.4.47 కోట్లతో జాతీయ రహదారి 16 నుంచి జాతీయ రహదారి 7 దోన్కల్ మీదుగా ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులకు రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేయనున్నట్టు ముప్కాల్ ఎంపీపీ సామ పద్మ వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి శనివారం వేర్వేరుగా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు వెన్నుదన్నుగా నిలవాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు,
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన

నవతెలంగాణ-కోటగిరి

అధికారులు రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. శనివారం పొతంగల్ మండలంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. మండలంలోని సుంకిని, కొల్లూర్, హెగ్డోలి గ్రామాలలో కొనసాగుతున్న కేంద్రాలను సందర్శించి, ధాన్యం సేకరణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం వివరాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. ధాన్యం తరలించిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట తడిసిపోయి ఒకింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు తెలుపగా, ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు అనుమతించినందున ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని కలెక్టర్ వారికి సూచించారు. తడిసిన ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించి బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని కొంగలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిస్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలని హితవు పలికారు. ఏ దశలోనూ రైతులు నష్టపోకుండా, ఇబ్బందులకు గురికాకుండా చూడాలన్నారు. కేంద్రాలకు రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ వెంటదివెంట జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం అనుమతించినందున ఇరవై శాతానికి మించి తడిసిన ధాన్యాన్ని సేకరిస్తూ బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. మిగతా ధాన్యాన్ని రా రైస్ మిల్లులకు పంపించడం జరుగుతోందన్నారు. జిల్లాలో ధాన్యం తరలింపు కోసం 900 వాహనాలను వినియోగిస్తున్నామని, అదనంగా మరో రెండు వందల వాహనాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎక్కడ కూడా ధాన్యం తరలింపులో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరుపుతున్నామని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, రైతులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించేందుకు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నామని అన్నారు. ప్రస్తుత సమయంలో రైతులకు వెన్నుదన్నుగా నిలువాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జెడ్పీటీసీ వెంకట్ పటేల్, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ విజయలక్ష్మి, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు సిరాజుద్దీన్, మండల కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, పొతంగల్ సొసైటీ సీఈఓ భరత్ తదితరులున్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

అక్రమ తీర్మానం చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- సీనియర్ అసిస్టెంట్ సలీం, అప్షన్ సభ్యుడు పాషాపై చర్యలు తీసుకోవాలి
- అటెండర్ గాయత్రికి న్యాయం చేయాలి
- అంబేద్కర్ యువజన సంఘం సభ్యుల డిమాండ్


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న గాయత్రిని అక్రమ తీర్మానం చేసి తొలగించిన విషయంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ అసిస్టెంట్ సలీం అందుకు ప్రోత్సహించిన మండల కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ హుస్సేన్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు పాలెపు నరసయ్య, అధ్యక్షులు సుంకరి విజయ్ కుమార్ స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న గాయత్రిని అక్రమ తీర్మానం చేసి తొలగించిన విషయంలో సీనియర్ అసిస్టెంట్ సలీం, మండల కో ఆప్షన్ సభ్యుడు అజ్మత్ హుస్సేన్ కీలకపాత్ర పోషించారన్నారు. తక్షణమే వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ, జిల్లా అధికారులను డిమాండ్ చేశారు. పక్షపాత వైఖరితో, స్వార్థంతో, మత వివక్షతో ఒక దళిత మహిళను సీనియర్ అసిస్టెంట్ తొలగించినా ఎంపీపీ చూసీచూడనట్టు వ్యవహరించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. సీనియర్ అసిస్టెంట్ సలీం, కోఆప్షన్ అజ్మత్ హుస్సేన్ కుట్ర పూరితంగా అక్రమ తీర్మానం చేశారన్నది తేటతెల్లం అయినప్పటికీ ఎంపీపీ దాన్ని ఖండించకుండా వారిపై ఎటువంటి చర్యలకు సిపార్సు చేయకపోవడం వల్ల ఎంపీపీ ప్రవర్తన, తీరుపై కూడా అనుమానం వస్తుందన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఉన్న ఎంపీపీ అక్రమ తీర్మాణం పట్ల తక్షణమే స్పందించి అందుకు కారణమైన వారిపై చర్యలకు సిఫార్సు చేయాలన్నారు. ప్రశాంతంగా ఉన్న కమ్మర్‌పల్లిలో మత విధ్వంసం సృష్టించాలని చూస్తున్న సీనియర్ అసిస్టెంట్ సలీం, కోఆప్షన్ అజ్మత్ హుస్సేన్‌లపై ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకొని అటెండర్ గాయత్రికి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. లేని పక్షంలో అధికారుల కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల ఇండ్లను ముట్టడిస్తామని, రాష్ట్రస్థాయిలో ఉద్యమం నిర్మాణం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం మండల కన్వీనర్ నిమ్మ రాజేంద్రప్రసాద్, ఉపసర్పంచ్ పాలేపు చిన్న గంగారాం, పాలేపు రవి కిరణ్, కౌడా లక్ష్మణ్, కొంటికంటి నరేందర్, ఎడ్ల నరేందర్, బెజగం గంగాధర్, చిట్యాల బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారం సీఓఈలో చేరికకు 8 చివరి తేదీ

- కళాశాల ప్రిన్సిపాల్ బి.సంగీత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ధర్మారం.బి సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ)కి ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 8 లోపు రిపోర్ట్ చేయాలని కళాశాల ప్రిన్సిపల్ బి.సంగీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి గానూ సీఓఈ జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్ష ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయని ఈ ఫలితాలను సొసైటీ వెబ్‌సైట్ https://tsswreisjc.cgg.gov.in/TSWRJC-CETWEB20/#1/home1912jkhmghj.rpsలో చెక్ చేసుకుని, అలాట్మెంట్ కాపీ, అలాట్మెంట్ కాపీలో సూచించిన ధృవీకరణ పత్రాలతో కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

వెల్‌నెస్ సెంటర్‌పై అపోహలొద్దు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు పాత్రికేయ మిత్రులకు కొరకు ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ మొదటగా రెవెన్యూ గెస్ట్ హౌస్ నందు ప్రారంభించబడి అనంతరం ఆ సెంటర్‌ను పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా, జిల్లా ఆసుపత్రి నందు ఏర్పాటు చేయగా విశ్రాంత ఉద్యోగుల సౌకర్యార్థం వెల్‌నెస్ సెంటర్‌ను ప్రభుత్వ ఆసుపత్రి గ్రౌండ్ ఫ్లోర్‌లో షెల్టర్ రూమ్ నందు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ వెల్‌నెస్ సెంటర్ శాశ్వత భవనం కొరకు, అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) చిత్ర మిశ్రా ఆధ్వర్యంలో, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ అలుక కిషన్ అధ్యక్షతన, విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు రవీందర్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి సమిష్టి కృషితో ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగులందరి సౌకర్యార్థం నగరంలో వివిధ భవనాలను పర్యవేక్షిస్తున్నారని, త్వరలో నూతన భవనానికి శాశ్వత ప్రాతిపదికన వెల్‌నెస్ సెంటర్‌ను ఆహ్లాదకరమైన వాతావరణంలో నూతన శాశ్వత భవనంలో వైద్య సేవలు ప్రారంభించుటకు ఉత్తర్వులు అందజేస్తామని జిల్లా కలెక్టర్ హామీనిచ్చారు. ఈ విషయాన్ని జిల్లా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, పాత్రికేయ మిత్రులు గమనించి, ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో గల షెల్టర్ రూమ్ నందు ఏర్పాటు చేసిన చేసిన వెల్‌నెస్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ప్రతిరోజు ఔట్ పేషెంట్ 80మందికి పైగా విచ్చేసి వైద్యం, మెడిసిన్స్ తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు రవీందర్, సభ్యులు భూమాగౌడ్, ఆశన్న, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, టీఎన్జీవో సహాధ్యక్షులు చిట్టి నారాయణరెడ్డి, సలహాదారులు ఆకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో ఇబ్బందులు


టీటీడీ కల్యాణమండపం పరిసరాల్లో నిలిచిన నీరు

నవతెలంగాణ-బోధన్

సాలూరా మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం నిరాదరణకు గురవుతోంది. వర్షాలు పడినప్పుడల్లా కళ్యాణ మండపం చుట్టు ఆవరణలో వర్షపు నీరు నిలిచి నడవలేని పరిస్థితి ఏర్పడింది. శుభకార్యాలు జరిగినప్పుడు వంటలు చేసుకోవాలన్నా, తిరగాలన్నా జనం ఇబ్బంది పడుతున్నారు. కనీసం మరుగుదొడ్లు ఉపయోగించుకోడానికి అటువైపు వెళ్ళలేని పరిస్థితి ఉందని పలువురు పేర్కొన్నారు. శుభకార్యాలకు వేల రూపాయలు వసూలు చేస్తూ అద్దెకు ఇస్తున్న టీటీడీ కళ్యాణ మండపాన్ని సంబంధిత శాఖ వారు పట్టించుకోవడంలేదని విమర్శలు వస్తున్నాయి. అద్దె వసూలు చేసే విషయంలో ఉన్న చిత్తశుద్ధి ప్రజలకు సౌకర్యాలు కల్పించకపోవడంపై ఎందుకు లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. కావున సంబంధిత టీటీడీ బోర్డు సభ్యులు స్పందించి వర్షపు నీటిని తొలగించి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఏఈఈ రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్‌సీ) ద్వారా ఈ నెల 8,9న జరుగనున్న రాత పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ తెలిపారు. రాత పరీక్ష కోసం నిజామాబాద్ జిల్లాలో మూడు సెంటర్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు రెండు సెషన్‌లలో రాత పరీక్ష జరుగుతుందని తెలిపారు. ఝఝఞ.ంజూంఏ.స్త్రశీఙ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ వెంట సెల్ ఫోన్, క్యాలిక్యులేటర్, స్మార్ట్‌వాచ్ వంటి ఎలక్ట్రానిక్ ఉపకారణాలేవీ వెంట తేకూడదని అన్నారు. ఉదయం సెషన్ పరీక్షకు సంబంధించి 9.30గంటలు, మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి 2గంటల తరువాత వచ్చిన వారిని పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 08462-220183ను సంప్రదించాలని అభ్యర్థులకు సూచించారు.

బీజేపీ హయాంలో కార్మికుల బతుకులు చిన్నాభిన్నం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ
- బోధన్‌కు చేరుకున్న బీజేపీ హటావో-దేశ్‌కో బచావో జీపుజాత

నవతెలంగాణ-బోధన్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో కార్మికుల బతుకులు చిన్నాభిన్నమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. శనివారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన బీజేపీ హటావో-దేశ్‌కో బచావో జీపుజాత బోధన్‌కు చేరుకున్న సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలను చైతన్య పరచడానికి ఇంటింటికి సీపీఐ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో దేశం ప్రమాదంలో ఉందని దుయ్యబట్టారు. దేశ ఆర్థిక వ్యవస్థను మోడీ సర్వనాశనం చేశారని అన్నారు. పోరాడి సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసి కార్మికులను, విద్యార్థులను రోడ్డుకీడ్చారని మండిపడ్డారు. సామాన్య ప్రజలు ఉపాధిలేక అన్నమో రామచంద్రా అని దుర్భర జీవనం కొనసాగిస్తున్నా, వారిపై మూలిగే నక్కపై తాటికాయ పడ్డచందంగా నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెంచి తీవ్ర ఇబ్బందుల పాలు చేశారని అన్నారు. తెలంగాణలో అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి ఒత్తిడి లేకుండా, తరుగు లేకుండా కొనుగోళ్లు చేయాలని, పూర్తిగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే డబుల్ బెడ్ రూములు అర్హులైన వారికే ఇవ్వాలని, నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వమే నడిపించాలని కోరారు. బోధన్ జిల్లాగా మార్చాలని న్యాయవాదులు చేస్తున్న దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య, నియోజకవర్గ కార్యదర్శి షేక్‌బాబు, జిల్లా కార్యదర్శి సుధాకర్, గౌస్, గౌతం, జయమ్మ రుక్మిణి, శబ్బీర్, సలీం, మొయిన్, ఆశీఫ్, మసూద్, మోహన్, అహ్మద్, ముత్యాలు, జావిద్, సాయిలు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పశ్య పద్మ

నాందేడ్ టు నిజామాబాద్‌కు గంజాయి

- 250 గ్రాముల గంజాయి పట్టివేత
- పోలీసుల అదుపులో నిందితుడు
- వివరాలు వెల్లడించిన ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీవీ సుబ్బారెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఓ యువకుడు నాందేడ్ నుంచి నిజామాబాద్ జిల్లాకు శనివారం తెల్లవారుజామున గుట్టు చప్పుడు కాకుండా తీసుకొస్తున్న యువకుడిని డ్యూటీలో ఉన్న ఆర్పీఎఫ్ ట్రైన్ ఎస్కార్టింగ్ స్టాఫ్ సిబ్బంది అర్ధరాత్రి ఒకటి గంటల 30 నిమిషాలకు పట్టుకున్నారని నిజామాబాద్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీవీ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీవీ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. డిచ్‌పల్లి మండలం మల్లాపూర్ నిజామాబాద్ జిల్లాకు చెందిన చీనేల్లి సుధీర్ తన వాహనాన్ని నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో పెట్టి నాందేడ్‌కు వెళ్లి నాందేడ్ నుంచి రైలు నంబరు 17664లో 250 గ్రాముల గంజాయి సుమారు దాని విలువ 2000 వరకు ఉంటుందని తెలిపారు. నాందేడ్ నుంచి కొనుగోలు చేసుకుని తీసుకొని వస్తున్నట్టు ఆర్పీఎఫ్ పోలీసుల ముందు ఒప్పుకున్నాడు. అలాగే నిందితుడు వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్లను, ద్విచక్రవాహనాన్ని నిజామాబాద్ లోకల్ పోలీసులు అనగా టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి కేసును అప్పగించినట్టు రైల్వే ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వీవీ సుబ్బారెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సుబ్బారెడ్డి

కల్లు గీత కార్మికులకు ఐదు లక్షల బీమా అభినందనీయం

- నిజామాబాద్ పట్టణ మూడవ గౌడ సంఘం అధ్యక్షులు స్వామిగౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కల్లు గీత కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయమని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మూడవ గౌడ సంఘం అధ్యక్షులు స్వామిగౌడ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్ రోడ్డులో గల మూడవ గౌడ సంఘంలో సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పట్టణ మూడవ గౌడ సంఘం అధ్యక్షులు స్వామి గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటూ అందులో భాగంగా తమ గౌడ కులస్తులను కూడా గుర్తించి బీమా సౌకర్యం కల్పించడం గొప్ప విషయమన్నారు. అదేవిధంగా పట్టణ మూడవ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి జయ సింహగౌడ్ మాట్లాడుతూ.. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మాత్యులు శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్‌రెడ్డి తోపాటు, ఎమ్మెల్సీ వీజీ గౌడ్, తెలంగాణ రాష్ట్ర వెల్ఫేర్ సీడబ్ల్యూసీ చైర్మన్ ఆకుల లలిత, ఎమ్మెల్సీ రాజేశ్వర్ సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నా మన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని తెలిపారు. మోపెడ్లు గీత కార్మికులకు ఇచ్చి కృషి చేయాలని, అలాగే ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి కేటాయించి వనాలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తే వారి జీవితాలు బాగుంటాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సుమన్‌గౌడ్, శ్యాంసుందర్‌గౌడ్, కిషన్‌గౌడ్, ప్రకాష్‌గౌడ్, సుభాష్‌గౌడ్, రాజుగౌడ్, నాగరాజుగౌడ్, నారాగౌడ్, నరసగౌడ్, కల్లుగీత కార్మికురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.


పలువురికి సన్మానం

సాఫ్ట్‌బాల్ ఆటలో రాటు దేలాలి

- గురుకులంలో ముగిసిన శిక్షణ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర గురుకుల సొసైటీ సెక్రటరీ రోనాల్డ్ రోస్ ఆదేశానుసారం సాంఘిక సంక్షేమ గురుకుల శాఖల పరిధిలో వేసవి సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని మండలంలోని సుద్దపల్లి గురుకుల పాఠశాలలో నిర్వహించిన సాఫ్ట్‌బాల్ శిక్షణ ముగింపు శిబిరానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ పానుగంటి రూపా సతీష్‌రెడ్డి పాల్గొన్నారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న సాంఘిక సంక్షేమ, గిరిజన, ఏకలవ్య, మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ సంక్షేమ శాఖలకు చెందిన విద్యార్థినులను ఉద్దేశించి సర్పంచ్ పానుగంటి రూపా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఇలాంటి మరెన్నో అవకాశాలను అందిపుచ్చుకోవాలని, విద్యార్థినులకు సూచించారు. క్యాంపు కన్వీనర్ సుద్దపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ పంతుకల గోదావరి మాట్లాడుతూ.. విద్యార్థినీలు 15 రోజులపాటు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొని చక్కని నైపుణ్యాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. శిక్షణలో పాల్గొన్న వారికి చక్కని పోషకాహారాన్ని అందించినట్టు తెలిపారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే విధంగా మరింత శిక్షణపొందిన పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవాలని, పూర్వంలో సుద్దపల్లి గురుకుల పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినీలు అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్నారని, మరో ముగ్గురు విద్యార్థినీలు జూన్‌నెలలో తైవాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారని ప్రిన్సిపాల్ గోదావరి వివరించారు. అంతకుముందు సర్పంచ్ పానుగంటి రూపా సతీష్‌రెడ్డికి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల సూపరింటెండెంట్ మహాలక్ష్మి, క్యాంప్ ఇంచార్జ్ నల్లూరి లత, కోచ్ వేముల మౌనిక, పి.మాధురి, పి.శృతి, జి.సునీత, ఎ.సుష్మ, జి.సంజీవ, హెల్త్‌సూపర్‌వైజర్ స్వర్ణలత, అసిస్టెంట్ కేర్ టేకర్ పాల్గొన్నారు.

8న ప్రియాంక గాంధీ యువజన సంఘర్షణ సభ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈనెల 8వ తేదీన రాష్ట్రంలో నిర్వహించే ప్రియాంక గాంధీ యువజన సంఘర్షణ సభపై సమీక్ష సమావేశం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. శనివారం కాంగ్రెస్ కార్యాలయం నందు కాంగ్రెస్ కమిటీ నగర అధ్యక్షుడు కేశ వేణు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజుతో కలిసి ఈనెల 8వ తేదీన రాష్ట్రంలో నిర్వహించే ప్రియాంక గాంధీ యువజన సంఘర్షణ సభ విషయమై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నగర అధ్యక్షులు కేశ వేణు మాట్లాడుతూ.. కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 8వ తేదీన రాష్ట్రంలో నిర్వహించే ప్రియాంక గాంధీ యువజన సంఘర్షణ సభ విషయమై నగర కాంగ్రెస్ పనుల నిమిత్తం అందుబాటులో లేనందున ఈనెల 8వ తేదీన రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ లో నిర్వహించే నిరుద్యోగ నిరసన జంగ్ సైరన్‌కు తనను ఇన్చార్జిగా నియమించారని, ఈ యువ సంఘర్షణ సభకు వేలాది మంది యువకులు తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువకుల గురించి చేసే కార్యక్రమాలు యూత్ డిక్లరేషన్ గురించి తెలుసుకోగలరని, అదే విధంగా ప్రియాంకగాంధీ యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని, నిజామాబాద్ జిల్లా నుంచి ప్రతి నియోజకవర్గం నుంచి 1500 నుంచి 2000ల మంది యువకులను ఈ సభకు తీసుకువెళ్లే విధంగా ఆయా నియోజకవర్గ ఇన్చార్జిలతో సమన్వయం చేస్తున్నామని, కావున జిల్లా యువకులు వేలాదిమందిగా తరలివచ్చి యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని కేశ వేణు అన్నారు. కార్యక్రమంలో కేశ మహేష్, బింగి మధు, సాయిబాబా, ప్రసాద్, అవీన్, నరేంద్ర సింగ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం


ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ-నవీపేట్

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలో పేదలకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సూర్యనారాయణ మాట్లాడుతూ.. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అందులో తాను భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని అన్నారు. మేడే వారోత్సవాలలో భాగంగా పేదలకు ఉచిత వైద్య శిబిరాన్ని అందించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు. మందులు ఉచితంగా పంపిణీ చేసిన పీఎంపీ వైద్యులు కిషన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాజశేఖర్, షేక్ మహబూబ్, సావిత్రి, షమీ, కాలనీవాసులు పాల్గొన్నారు